

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
బుధవారం 17 జులై 2024
జిల్లా వార్తలు



ఆకట్టుకున్న సహజ సౌందర్యం



పాడేరు- అరకులోయ హైవేలో డుంబ్రిగుడ మండలం పంతెలచింతకు సమీపంలో ఇదీ దృశ్యం

మన్యం సహజ సౌందర్యం ప్రకృతి ప్రియులను కట్టిపడేస్తుంది. ప్రస్తుతం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండలన్నీ కడిగేసినట్టుగా పచ్చదనంతో కనువిందు చేస్తున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నది. ఆపై నిండుగా పారుతున్న గెడ్డలు, వాగులు అలరిస్తున్నాయి. పాడేరు నుంచి అరకులోయ వెళ్లే జాతీయ మార్గంలోని డుంబ్రిగుడ మండలం పంతెలచింత గ్రామానికి సమీపంలో పచ్చని కొండ... కిందన వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న గెడ్డ మైమరపిస్తున్నది. ఆ సుందర దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

-ఆంధ్రజ్యోతి/పాడేరు



కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

పాడేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అమిత్‌బర్దార్ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ జిల్లాలోని గంజాయి నిర్మూలన, నేరాల నియంత్రణ తదితర అంశాలతో పాటు గంజాయి సాగు విడనాడే గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగులో ప్రోత్సాహం తదితర విషయాలను చర్చించారు.

150 కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



పులిగొందిలో పట్టుబడిన గంజాయి, నిందితునితో పోలీసులు

పెదబయలు, జూలై 16 : ఓ ఇంట్లో భద్రపరచిన 150 కిలోల గంజాయిని సోమవారం పెదబయలు పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కిముడుపల్లి పంచాయతీ పులిగొంది గ్రామంలో కిల్లో చిట్టిబాబు ఇంటిలో గంజాయి నిల్వలు ఉన్నాయని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జి.మాడుగుల సీఐ రమేశ్ ఆధ్వర్యంలో పెదబయలు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మూడు బస్తాల్లో నిల్వ ఉంచిన 150 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కిల్లో చిట్టిబాబుపె ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేసి, మంగళవారం రిమాండుకు తరలించారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది, వీఆర్‌వో పాల్గొన్నారు.

పాఠశాలకు ఎసరు!

హైవే అధికారుల నిర్వాకం

- జాతీయ రహదారి విస్తరణలో పోయిన జల్లూరు ప్రాథమిక పాఠశాల స్థలం, ప్రహరీ
- భవనం ఉన్నా.. లేనట్టే..
- పరిహారం ఇస్తామని, భవనాన్ని నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చని అధికారులు
- గిరిజనుడు ఇంటి వరండాలో విద్యాబోధన



గిరిజనుడు ఇంటి వరండాలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు



జాతీయ రహదారికి విస్తరణకు ముందు పాఠశాల భవనం

చింతపల్లి, జూలై 16: మండలంలోని జల్లూరుమెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు భవనం లేక అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణలో పాఠశాలకు చెందిన 2.5 సెంట్లు స్థలం పోయింది. అలాగే ప్రహరీ గోడ, 30 శాతం భవనం ధ్వంసమైంది. ఎన్‌హెచ్ అధికారులు పరిహారం చెల్లించలేదు, నూతన పాఠశాల భవనం నిర్మించలేదు. ప్రస్తుతం విద్యార్థులు గ్రామంలో ఉన్న ఓ గిరిజనుడు ఇంటి వరండాలో విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారికి ఆనుకుని జల్లూరు మెట్ట ఎంపీపీ పాఠశాల ఉన్నది. జాతీయ రహదారి విస్తరణకు ముందు ప్రధాన మార్గానికి 30 మీటర్ల దూరంలో పాఠశాల ఉండేది. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 31 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ కోసం ఎన్‌హెచ్ అధికారులు పాఠశాల భవనాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. రహదారి విస్తరణలో పాఠశాల స్థలం, ప్రహరీ గోడ, భవనం నష్టపోవడం వల్ల పరిహారం చెల్లిస్తామని, నూతన భవనం నిర్మిస్తామని ఎన్‌హెచ్ అధికారరలు పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. దీంతో గత ఏడాది డిసెంబరులో పాఠశాల భవనం విడిచి గ్రామంలో ఓ గిరిజనుడు ఇంటి వరండాలో పాఠశాల నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణలో పాఠశాలకు చెందిన 2.5 సెంట్లు స్థలం, ప్రహరీ గోడ, పాఠశాల భవనం 30 శాతం ధ్వంసమైంది. ప్రస్తుతం పాఠశాల భవనానికి ఆనుకుని జాతీయ రహదారి ఉన్నది. పాఠశాలకు వెళ్లాంటే విద్యార్థులు నిచ్చెనపై వెళ్లాలి. అలాగే అక్కడే ఉంటే వాహనాల వల్ల దూళి నేరుగా విద్యార్థులపై పడుతున్నది. ధ్వని కాలుష్యం కూడా అధికంగా ... మిగతా 8వ పేజీలో

పాఠశాల నూతన భవనం నిర్మించాలి



జాతీయ రహదారి అధికారులు పాఠశాల నూతన భవనం తక్షణమే నిర్మించాలి. విస్తరణకు సంబంధించి పాఠశాలకు ఇరువైపులానున్న గృహాలకు రూ.6 నుంచి 8లక్షలు నష్టపరిహారం చెల్లించారు. పాఠశాల ప్రహరిగోడ, స్థలం, భవనాన్ని కోల్పోయి నప్పటికీ ఇంతవరకు పరిహారం చెల్లించలేదు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని పాఠశాల నూతన భవనం నిర్మాణానికి కృషి చేయాలి.

గెమ్మెలి సుబ్బారావు, చైర్మన్, విద్యాకమిటీ, జల్లూరిమెట్ట.

గోమంగి పీహెచ్‌సీలో విద్యుత్ వెలుగులు

'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు

- పంచాయతీలో విద్యుత్ సమస్య పరిష్కారం
- సిబ్బందితో ఇన్సులేటర్లు, డిస్కులు మార్పు



మరమ్మతులు చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

పెదబయలు, జూలై 16: గోమంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విద్యుత్ సమస్యను ఏపీఈపీడీసీఎల్ అధికారులు మంగళవారం పరిష్కరించారు. 'సెల్‌ఫోన్ టార్చి వెలుగులో రోగులకు వైద్యసేవలు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. గోమంగి పంచాయతీలో విద్యుత్ సమస్యకు గల కారణాలను గుర్తించారు. పాడైన ఇన్సులేటర్లు, డిస్కులను మార్చారు. తొలుత పీహెచ్‌సీకి విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం పంచాయతీలో సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రూడకోట 11కేవీ ఫీడర్ స్తంభాలు పడిపోవడం, కొన్నిచోట్ల ఇన్సులేటర్లు, డిస్కులు కాలిపోవడం వలన విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం జరిగేదన్నారు. ప్రస్తుతం అన్ని కొత్త సామగ్రి మార్చడం జరిగిందని, ఇకపై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదన్నారు.

ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

రెండు, మూడు వారాల్లో నియామకం



- రేస్‌లో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు
- ఇంచుమించు పది మంది వరకూ...
- తమకు ఉన్న పరిచయాల ద్వారా పైరవీలు
- ఇప్పటికే సమాచార సేకరణలో ప్రభుత్వం

- వార్త 7వ పేజీలో..

ఎమ్మెల్సీ టికెట్‌కు వైసీపీలో లొల్లి

స్థానిక సంస్థల కోటాలో భర్తీ చేయనున్న స్థానం కోసం నేతల మధ్య పోటీ

- వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం
- పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుకు గతంలో అధిష్ఠానం హామీ
- ఎన్నికల అనంతరం మారిన పరిణామాలు
- తనకు కావాలంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్
- తనకు ఇవ్వాలని మాజీ ఎంపీ ఎంవీవీ పట్టు
- అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం మల్లగుల్లాలు



కోలా గురువులు



గుడివాడ అమర్‌నాథ్



ఎంవీవీ సత్యనారాయణ

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ టికెట్ కోసం లొల్లి మొదలైంది. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరు నెలల కిందట పార్టీకి, పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం కోసం జిల్లాలో ఆ పార్టీ నేతలు పోటీపడుతున్నారు. ఈ వ్యవహారం అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది.

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మెజారిటీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కాగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణిలను ఎంపిక చేశారు. అయితే వంశీకృష్ణ గత ఏడాది నవంబరులో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపు పేరుతో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా శాసన మండలి చైర్మన్ ప్రకటించారు. ఆ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సి ఉంది. ఈలోగా సాధారణ ఎన్నికలు వచ్చాయి.

దీంతో ఎమ్మెల్సీ ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదు. త్వరలో ఎమ్మెల్సీ స్థానాన్ని భర్తీ చేయనుండడంతో వైసీపీలో ఆశావహులు బయటకు వస్తున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం, 2014లో వైసీపీ తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కోలా గురువులుకు 2019, 2024 ఎన్నికల్లో పోటీకి పార్టీ అధిష్ఠానం అవకాశం ఇవ్వలేదు. 2023లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులకు ఎన్నిక జరిగినప్పుడు గురువులును అధిష్ఠానం పోటీకి దింపింది. అయితే కొంత మంది ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో గురువులు ఓటమి పాలయ్యారు. తర్వాత పార్టీ ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాన్ని పార్టీకి విధేయుడిగా ఉన్న కోలా గురువులుకు ... మిగతా 8వ పేజీలో

అంగన్‌వాడీ సేవలు అందకుంటే చర్యలు

కలెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరిక



సమావేశంలో పాల్గొన్న సీడీపీవోలు, సూపర్‌వైజర్లు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

- చర్యలు తీసుకున్నప్పుడు సంఘ నేతలతో ఒత్తిడి తెస్తే వారిని కూడా ఉపేక్షించబోనని స్పష్టీకరణ
- అరకొర సమాచారంతో హాజరు కావడంపై కలెక్టర్ అసంతృప్తి
- బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం

పాడేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ సేవలు లబ్ధిదారులకు సక్రమంగా అందకుంటే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలో ఐసీడీఎస్ సేవలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ సేవలను పక్కాగా అందించాలని, తప్పులు జరిగినట్టు ఫిర్యాదు వస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపడతామన్నారు. ఈ క్రమంలో సంఘాల నేతలతో తమపై ఒత్తిడులు తెస్తే, సంబంధిత సంఘాల నేతపైనా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అలాగే జిల్లాలో సమస్యాత్మక అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలన్నారు. అలాగే ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీల సమస్యలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సరైన సమాచారం లేకుండా పలువురు సీడీపీవోలు, ఐసీడీఎస్ పీడీ సైతం హాజరుకావడంపై కలెక్టర్ అసంతృప్తి చెంది, ఇకపై అరకొర సమాచారంలో సమావేశాలకు హాజరుకావద్దని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో నాణ్యమైన సరుకులు సరఫరా కావాలని, వాటి చిత్రాలు, వీడియోలను ఇతర ప్రాంతాల్లో ప్రదర్శించాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన పోషకార, వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే బాల్య వివాహాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అందులో భాగంగా వివాహాలు జరిపించే పెద్దలు, పూజారులకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను తెలపాలన్నారు. అందుకుగానూ సీడీపీవోలు, ఎంపీడీవోలు గ్రామాలు సందర్శించాలని కలెకర్ సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, పాడేరు, చింతూరు డివిజన్లలోని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

టొంగికోట పాఠశాల భవనం నేలమట్టం

- బిల్డింగ్‌పై పడిన భారీ చెట్టు
- రాత్రి వేళ కావడంతో తప్పిన పెను ముప్పు
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు
- హుటాహుటిన వెళ్లిన విద్యా శాఖ అధికారులు
- కొత్తది నిర్మించాలని పలు పర్యాయాలు గ్రామస్థుల వినతి
- అయినా పట్టించుకోని అధికారులు



చెట్టు పడడంతో నేలమట్టమైన పాఠశాల భవనం

ముంచంగిపుట్టు, జూలై 16: మండలంలోని వనభసింగి పంచాయతీ టొంగికోట ఎంపీపీఎస్ పాఠశాల భవనంపై సోమవారం రాత్రి భారీ చెట్టు పడింది. దీంతో భవనం నేలమట్టమైంది. ఈ సంఘటన రాత్రి వేళలో జరగడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే

వనభసింగి పంచాయతీ టొంగికోట ఎంపీపీఎస్ పాఠశాలలో 23 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భారీ వృక్షం పాఠశాల భవనంపై ... మిగతా 8వ పేజీలో

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు.
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029



శ్రద్ధాంజలి
మంచిమనిషి, నిస్వార్థపరుడైన
కీ॥శే॥ గొంగమళ్ళ రమణ గారు
భౌతికంగా మా నుండి దూరమైనప్పటికీ మీ జ్ఞాపకాలు మా మదిలో మెదులుతున్నాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ గొంగమళ్ళ రమణ గారు
మెయిన్‌రోడ్ పాడేరు
భార్య : శ్రీమతి గొంగమళ్ళ కుమారి
పెద్ద కుమారుడు - పెద్ద కోడలు : గొంగమళ్ళ రాజేష్ - ఉష
చిన్న కుమారుడు - చిన్న కోడలు : గొంగమళ్ళ రాము - మాధవి
మనుమరాలు : గొంగమళ్ళ షరణ్య దుర్గ
మనుమలు : గొంగమళ్ళ లిఖిత్ కుమార్, గొంగమళ్ళ మోహిత్, గొంగమళ్ళ బన్ని
మేనల్లుళ్ళు & బంధుమిత్రులు
పెద్దకర్మ : తేది.17-07-2024 బుధవారం పాడేరులోని మా స్వగృహమునందు జరుగును.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో రైతు మృతి

» తురకలపూడిలో విషాదం



తోకల సత్యారావు, (ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, జూలై 16: మండలంలోని తురకలపూడి గ్రామంలో మోటారు వేయగా విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. మృతుడు కుటుంబీకుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తురకలపూడి గ్రామానికి చెందిన తోకల సత్యారావు (65) మంగళవారం మధ్యాహ్నం పొలానికి నీరు పెడదామని వ్యవసాయ మోటారు స్విచ్ ఆన్ చేశాడు. బోర్డుకు విద్యుత్ సరఫరా కావడంతో సత్యారావు పెద్దగా కేకలు పెట్టి పడిపోయాడు. దీంతో సమీపంలో ఉన్న రైతులు చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సిఫార్సు చేయడంతో కుటుంబీకులు ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సత్యారావు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సత్యారావు మృతి చెందడంతో భార్య సోమేశ్వరి, ఇద్దరు కుమారులు చంద్రరావు, కామేశ్వరరావు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదవశాత్తూ నేల బావిలో పడి రైతు మృతి

నాతవరం, జూలై 16 : మండలంలోని ఎంబీపట్నంలో ప్రమాదవశాత్తు నేలబావిలో పడి రైతు మృతి చెందాడు. నాతవరం ఎస్‌ఐ ఎం. రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎంబీపట్నం గ్రామానికి చెందిన రైతు ఉలబాల సత్యనారాయణ (44) మంగళవారం పొలంలో గడ్డి కోస్తూ ప్రమాదవశాత్తు నేలబావిలో పడి పోయి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు సత్యనారాయణ కుమార్తె గాలి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామారావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామని ఆయన తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై దాడులు

» పోలవరం కాలువ గట్టు వద్ద ఎక్స్‌కవేటర్, రెండు లారీలు, ట్రాక్టర్ సీజ్



పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

కశింకోట, జూలై 16 : మండలంలోని నర్సింగబిల్లి శివారున ఉన్న పోలవరం ఎడమ కాలువ గట్టుకు ఉన్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలవరం ఎడమ కాలువ డీఈ ప్రేమ్‌బాబు, తహసీల్దార్ మధుసూదన్, మైన్స్ ఆర్‌ఐ స్వాతి, ఆర్‌ఐ రమేశ్, పోలీసులు సంయుక్తంగా మంగళవారం దాడి చేశారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న ఒక ఎక్స్‌కవేటర్, ఒక ట్రాక్టర్, రెండు లారీలను సీజ్ చేసి కశింకోట పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టవద్దని కశింకోట పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసి మరీ అప్పగించామని తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. కాగా కోట్లాది రూపాయలు ప్రభుత్వం వెచ్చించి పోలవరం కాలువ నిర్మాణం చేస్తుంటే ఈ విధంగా గట్లను కొల్లగొట్టడం పట్ల ఈ ప్రాంత రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల స్వాహాపై హార్టికల్చర్ అసిస్టెంట్‌కు చార్జి మెమో

రోలుగుంట, జూలై 16: మండలంలోని కె.నాయుడుపాలెం ఆర్‌బీకే కేంద్రంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్.నరేంద్రకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ మంగళవారం చార్జి మెమో జారీచేశారు. గత ఏడాది ఖరీఫ్‌లో వరి విత్తనాల విక్రయాలకు సంబంధించి 150 మంది రైతుల నుంచి వసూలు చేసిన రూ.1.35 లక్షలు ఆర్‌బీకే ఖాతాకు జమ చేయకుండా స్వాహా చేశారు. అలాగే కె.నాయుడుపాలెంలో 20 మంది రైతులకు రాయితీపై యాంత్రీకరణ పరికరాలు తక్కువ ధరకే అందిస్తానని నమ్మబలికి రైతులను మోసం చేసిన ఘటనపై కూడా గతంలో ఆ గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు మూడు రోజుల్లో చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చార్జి మెమో జారీ చేశారు.

ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల సేవలు ప్రశంసనీయం

» బదిలీ అయిన ఎస్పీ మురళీకృష్ణకు సత్కారం



బదిలీ అయిన ఎస్పీ మురళీకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూలై 16: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, సారా, గంజాయి రవాణాను అరికట్టడం, తదితర అంశాల్లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది జిల్లా పోలీసులకు వెన్నుముకగా నిలిచారని బదిలీ అయిన ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి అనంతపూర్ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణను ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది మంగళవారం విశాఖ కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలు, బందోబస్తు, భద్రతా అంశాల్లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం మురళీకృష్ణను ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది దుశ్శాలువాను కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీలు ఎస్. అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, డి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, మన్మథరావు, సతీశ్ పాల్గొన్నారు.

తిరుమలకు పర్యాటక శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

విశాఖపట్నం, జూలై 16: విశాఖ నుంచి తిరుమలకు వెళ్లే ప్రయాణికుల కోసం పర్యాటక శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీ రూపొందించింది. ఈనెల 19వ తేదీ నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు 30 స్లీపింగ్ బెర్తులతో కూడిన ఏసీ బస్సు నగరంలో బయలుదేరనుంది. అప్పుఘర్ యాత్రి నివాస్ హోటల్ నుంచి బయలుదేరి గాజువాక, అనకాపల్లి, రాజమండ్రి, శ్రీకాళహస్తి మీదుగా తిరుపతికి చేరుకుంటుంది. 20వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి హరిత హోటల్‌లో ఫ్రెషప్, అల్పాహారం, అదేరోజు తిరుమలలో స్వామివారి దర్శనం, మధ్యాహ్న భోజనం, పద్మావతి అమ్మవారి దర్శనం ఉంటాయి. సాయంత్రం బస్సు తిరుగు ప్రయాణం అవుతుంది. శ్రీకాళహస్తిలో రాత్రి భోజనం, మరుసటి రోజు ఉదయం విశాఖకు చేరడంతో పర్యటన పూర్తవుతుంది. ఈ ప్యాకేజీలో పెద్దలకు రూ.6,300, పిల్లలకు రూ.6వేలుగా టికెట్ నిర్ణయించారు. తొలి సర్వీసును కలెక్టర్ హరీంధీర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, టూరిజం డెవలప్‌మెంట్ ఆర్‌డీ శ్రీనివాస్ పాణి ప్రారంభించనున్నారు.

తైక్వాండోలో ఆరుగురికి స్వర్ణ పతకాలు

ఎలమంచిలి, జూలై 16 : హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి క్రీడాకారులు 6 బంగారు పతకాలు సాధించినట్టు ఎలమంచిలి తైక్వాండో ఫౌండర్ కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఎం.కుందన ప్రజ్ఞ, పి.సుస్మిత, దీక్షిత్ లహరి, సింహాద్రి, శ్రీవృశాగ్‌లు స్వర్ణ పతకాలు సాధించగా, ఎన్.శ్రీ ఇషిత, పోలవరపు దేవి, వుడా నందకృష్ణ, జి.విష్ణులు రజితం, బి.భవానీ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

పట్నం మెయిన్ రోడ్డు పనుల నాణ్యత పరిశీలన

» విశాఖపట్నం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ



మెయిన్ రోడ్డు పనుల్లో నాణ్యత నిర్ధారణకు నమూనాలు సేకరిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నర్సీపట్నం, జూలై 16: మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత నిర్ధారణకు విశాఖపట్నం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బీటీ రోడ్డులో పలు చోట్ల నమూనాలు సేకరించారు. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి, సెంటర్ డివైడర్, డ్రైనేజీ నిర్మాణ పనులకు గత వైసీపీ ప్రభుత్వం రూ.10.6 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం కోసం భవన యజమానులు హైకోర్టును ఆశ్రయించడంతో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రభుత్వ ఆస్తులు ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతం వరకు రోడ్డు విస్తరణ చేసి బీటీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టారు. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1500 మీటర్లు రోడ్డు, మూడు వేల మీటర్లు డ్రైనేజీ పనులు చేపట్టాల్సి ఉండగా, కేవలం 260 మీటర్ల రోడ్డు, 250 మీటర్ల డ్రైనేజీ పనులు చేశారు. మెయిన్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతపై పలు అనుమానాలు ఉన్నాయి. ఇసుక బదులు క్వారీ బూడిద వాడారని ఆరోపణలు ఉన్నాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై విచారణ చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ అండ్ బీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు గత నెలలో మెయిన్ రోడ్డు తనిఖీ చేసి వెళ్లారు. ఈ నెల 12వ తేదీన అయ్యన్నపాత్రుడు మరోమారు రోడ్లు, భవనాల శాఖ అధికారులకు మెయిన్ రోడ్డు నాణ్యత తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు నాణ్యత నిర్ధారణకు నమూనాల సేకరణ

విశాఖపట్నం నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఈఈ శ్రీహరి బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం నర్సీపట్నం వచ్చి రోడ్డు పనుల్లో నాణ్యత నిర్ధారణకు నమూనాలు సేకరించారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డ్రైనేజీ, బీటీ రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లోడి గెడ్డలో ఫార్మా వ్యర్థ జలాల తొలగింపునకు శ్రీకారం

» ట్యాంకర్లతో రాంకీకి తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వ్యర్థ జలాలను తోడుతున్న ట్యాంకర్ వద్ద భరిణికం గ్రామస్థులు

పరవాడ, జూలై 16: పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలోని స్థానిక మల్లోడి గెడ్డలో నిల్వ ఉన్న ఫార్మా వ్యర్థ జలాల తొలగింపునకు పీసీబీ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఈఈ పీవీ ముకుందరావు పర్యవేక్షణలో గెడ్డలో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న వ్యర్థ జలాలను పైపు ద్వారా ట్యాంకర్‌లోకి ఎక్కించి రాంకీలో గల కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈపీటీ)కు తరలిస్తున్నారు. మల్లోడి గెడ్డలో పెద్ద ఎత్తున ఫార్మా వ్యర్థ జలాలు విడిచిపెట్టడంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం', 'ఫార్మా యాజమాన్యాల బరితెగింపు' శీర్షికన వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. గెడ్డలో నిల్వ ఉన్న వ్యర్థ జలాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవ్వడంతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే విషయాన్ని కథనాల్లో ప్రస్తావించడంతో పీసీబీ అధికారులు స్పందించారు. ఫార్మాలో గల పరిశ్రమలకు నోటీసులు కూడా జారీ చేసిన సంగతి తెలిసిందే. మల్లోడి గెడ్డలో ఫార్మా వ్యర్థ జలాలు కలవడం వల్లే నీరు నల్లగా మారడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్న విషయం పీసీబీ అధికారుల పరీక్షలో తేలింది. దీంతో భరిణికం గ్రామస్థులు వ్యర్థ జలాలను టాంకర్లతో తరలించాలని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు పీసీబీ అధికారులు గెడ్డలో ఉన్న వ్యర్థ జలాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. అయితే గెడ్డలో పూర్తిస్థాయిలో వ్యర్థ జలాలు తొలగించాలంటే నాలుగైదు ట్యాంకర్లు అవసరముందని, దీని దృష్టిలో పెట్టుకుని అదనంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసి త్వరగా వ్యర్థ జలాలను తొలగించాలని మాజీ సర్పంచ్ బొండా తాతారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, పెద్దిశెట్టి వెంకట సత్యారావు డిమాండ్ చేశారు. గెడ్డలో వ్యర్థ జలాలను తోడుతున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు.

ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

» రెండు, మూడు వారాల్లో నియామకం
» రేస్‌లో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు
» తమకు ఉన్న పరిచయాల ద్వారా పైరవీలు
» ఇప్పటికే సమాచార సేకరణలో ప్రభుత్వం
» ఇన్‌చార్జిని నియమించిన తరువాత పూర్తిస్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత నెలాఖరులో వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్ తమ పదవులకు రాజీనామా చేశారు. స్టీఫెన్ స్థానంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబును నియమించారు. వీసీ పోస్టు మాత్రం ఖాళీగానే ఉంది. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతోపాటు కీలక నిర్ణయాలు తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి వీసీ నియామకం ఇప్పటికిప్పుడు సాధ్యం కానందున రెండు, మూడు వారాల్లో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

ఏయూతోపాటు రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను ప్రభుత్వం నియమించనున్నది. ఇందుకోసం సమ ర్థులైన వారిని గుర్తించే బాధ్యతను సీఎం చంద్రబాబు నాయుడు కొందరికి అప్పగించినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఏయూలో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొందరు తమ స్థాయిలో ప్రయత్నాలను చేస్తుండగా, మరికొందరు తమకున్న సీనియారిటీని బట్టి అవకాశం వస్తుందన్న భావనలో ఉన్నారు. ప్రస్తుతం ఏయూ ఇన్‌చార్జి వీసీ రేస్‌లో సుమారు పది మంది ఉన్నారు. వీరిలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, ఫారెన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శశిభూషణ్, శ్రీకాకుళం యూనివర్సిటీ వీసీగా పనిచేసి, ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న ప్రొఫెసర్ రాంజీ, ఎగ్జామినేషన్ విభాగం డీన్‌గా చేస్తున్న ప్రొఫసర్ డీవీఆర్ మూర్తి, ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, గతంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా చేసి ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ వల్లీ కుమారి, అదే విభాగంలో పనిచేస్తున్న మరో సీనియర్ ప్రొఫెసర్ శశితోపాటు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీగా పదవీ విరమణ పొందిన మరో సీనియర్ ప్రొఫెసర్ పేరు వినిపిస్తోంది. వీరిలో ఒక సీనియర్ ప్రొఫెసర్ రాజకీయంగా తనకున్న పలుకుబడిని వినియోగిస్తున్నట్టు తెలిసింది. స్పీకర్‌తోపాటు పొరుగు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ద్వారా ప్రయత్నాలను సాగిస్తున్నట్టు తెలిసింది. అయితే, ఆయన గత వీసీ ప్రసాదరెడ్డి కోటరీకి చెందిన వ్యక్తి అన్న ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. అలాగే, నగరానికి చెందిన ఇద్దరు కీలక నేతలు ద్వారా మరో సీనియర్ ప్రొఫెసర్ తన ప్రయత్నాన్ని చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. గతంలో శ్రీకాకుళం యూనివర్సిటీకి వీసీగా చేసిన మరో ప్రొఫెసర్ తనకు బంధువైన అధికార పార్టీ ఎమ్మెల్యే ద్వారా తన ప్రయత్నాన్ని గట్టిగానే చేస్తున్నారు. పరిశోధనలు, సీనియారిటీ, ఇంటర్నేషనల్ ప్రాజెక్టు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకని తనకు అవకాశం కల్పిస్తారన్న భావనలో మరో సీనియర్ ప్రొఫెసర్ ఉండగా, వర్సిటీలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను తానైతే పరిష్కరించగలనన్న భావన ప్రభుత్వ పెద్దల్లో ఉందని, తనకు అవకాశం దక్కుతుందని మరో ప్రొఫెసర్ చెబుతున్నారు. ప్రభుత్వం సదరు సీనియర్ ప్రొఫెసర్ పేరు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్న భావనను మరో సీనియర్ ప్రొఫెసర్ వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు బయట నుంచి మరో ఇద్దరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. ప్రభుత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుందో చూడాలి.

గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి

వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వీసీలంతా గవర్నర్‌కు తమ రాజీనామాలు చేశారు. రాజీనామాలపై గవర్నర్ న్యాయ సలహాను కోరడం వల్లే కొత్త వీసీల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్టు చెబుతున్నారు. గవర్నర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే అప్పటికే సిద్ధం చేసిన జాబితాల్లో ఒకరిని ఇన్‌చార్జి వీసీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ నియామక ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు దరఖాస్తుల స్వీకరణ, సెర్చ్ కమిటీ నియామకం, ఇతర ప్రక్రియను పూర్తిచేసి పూర్తిస్థాయి వీసీలను నియమించనున్నారు.

విద్యార్థుల మారకద్రవ్యాల వినియోగంపై విచారణ

జి.మాడుగుల, జూలై 16: ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులు మారకద్రవ్యాలు వినియోగించారన్న అంశంపై డిప్యూటీ కలెక్టర్ శర్మ మంగళవారం విచారించారు. పోలీసు, రెవెన్యూ కళాశాల సిబ్బందితో వసతిగృహంలో తనిఖీలు చేపట్టగా, అక్కడ పరిస్థితుల ఆధారంగా విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగించినట్టు నిర్ధారించారు. అంతేకాకుండా కళాశాల వసతి గృహంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించినట్టు గుర్తించారు. విద్యార్థులు వ్యసనాలకు, అపరిచిత వ్యక్తులను నిలువరించడంలో విఫలమైన వార్డెన్‌పై విచారణాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకోవాలని సూచించారు. అంతకుముందు రెవెన్యూ, పోలీసులతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. గంజాయి వంటి మారకద్రవ్యాలు వసతి గృహంలోకి వచ్చే మార్గాలను అన్వేసించాలని ఎస్‌ఐ శ్రీనివాసరావును ఆదేశించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. విచారణలో తహసీల్దార్ నర్సమ్మ, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ప్రిన్సిపాల్ గౌరీశంకర్, ఆర్‌ఐ కామేశ్వరరావు, కార్యదర్శి రవిశాస్త్రి, సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

రైళ్లు మళ్లింపు, రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 16: విజయవాడ డివిజన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనుండగా, మరికొన్ని రైళ్లను ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో..

ఈనెల 22, 29న ఎర్నాకులం-హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22878) వయా రేణుగుంట, ఎర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు, కృష్ణా కెనాల్ మీదుగా, సంత్రాగచ్చి-తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట, చెన్నై ఎగ్మోర్ మీ దుగా, ఈనెల 22న హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రాగుంట్ల, రేణుగుంట మీదుగా నడుస్తాయి.

రీ షెడ్యూల్..

ఈనెల 21న మల్దా టౌన్-బెంగళూరు అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ (13434), ఈనెల 21, 26న హౌరా-మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (228 17), ఈనెల 18, 21, 25న హౌరా-తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్ (12663), ఈ నెల 22, 29న హౌరా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (12665), ఈ నెల 26న సిలిఘాట్ టౌన్-తంబరం ఎక్స్‌ప్రెస్ (15630), ఈనెల 22న న్యూటిన్సుకియా- తంబరం ఎక్స్‌ప్రెస్ (15930), ఈనెల 23, 26తేదీల్లో సంత్రాగచ్చి- చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22807) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి గంటన్నర ఆలస్యంగా బయలుదేరుతాయి.

పలు రైళ్ల గమ్యాల కుదింపు

తంబరం స్టేషన్‌లో నిర్మాణ పనులు చేపట్టనున్నందున పలు రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. దీంతో జసిదిహ్- తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) 27న చెన్నై ఎగ్మోర్ వరకు, సంత్రాగచ్చి- తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) ఈనెల 22, 29న చెన్నై బీచ్ వరకు, సిలిఘాట్ టౌన్- తంబరం ఎక్స్‌ప్రెస్ (15630) చెన్నై సెంట్రల్ వరకు, న్యూ టిన్సుకియా-తంబరం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (15930) ఈనెల 22, 29న చెన్నై ఎగ్మోర్ వరకు నడుస్తుంది. పైన పేర్కొన్న రైళ్లు తంబరం స్టేషన్ చేరవని ఆయన స్పష్టం చేశారు. అలాగే తిరుగు ప్రయాణంలోని తంబరం- జసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఈనెల 27న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22842) ఈనెల 24, 31న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సిలిఘాట్ టౌన్ ఎక్స్‌ప్రెస్ (15629) ఈనెల 29న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం-న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ (15929) ఈనెల 25న చెన్నై ఎగ్మోర్ నుంచి బయలు దేరుతాయని పేర్కొన్నారు.

దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు ఆయన తెలిపారు. 06087 నంబరు గల రైలు ఈనెల 18, 25న (ప్రతి గురువారం) తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.57 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 20, 27న (ప్రతి శనివారం) సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది.

కల్కి అవతారంలో జగన్నాథుడు



కల్కి అవతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 16: స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి మంగళవారం భక్తులకు కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. కాగా సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామికి ఓ భక్తుడు వెండి కిరీటాలను బహూకరించారు. వాటిని ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ అలంకరించారు.

వేంకటేశ్వరునిగా...



వేంకటేశ్వరస్వామి అలంకరణలో జగన్నాథుడు

చోడవరం, జూలై 16: జగన్నాథ రథోత్సవాల సందర్భంగా దశ రూప మహోత్సవాలలో భాగంగా మంగళవారం జగన్నాథస్వామి వేంకటేశ్వరస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణిబాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి వెంకన్న ఆలయం ముస్తాబు



తొలి ఏకాదశి పూజలకు ముస్తాబైన స్వామివారి ఉత్సవమూర్తులు

నక్కపల్లి, జూలై 16: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో బుధవారం నిర్వహించనున్న తొలి ఏకాదశి పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం స్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు తిరుమంజనసేవలు చేశారు. ఆలయంలో పెండాల్స్ ఏర్పాటు చేశారు. కొండపై వున్న స్వామివారి నిజరూపానికి బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు పంచామృతాభిషేకం చేసిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ అర్చకులు చెప్పారు.

శాకాంబరిగా దుర్గాదేవి



ఆషాడ మాసం సందర్భంగా నర్సీపట్నంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆకు కూరలు, పండ్లతో దుర్గాదేవిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో శాకాంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - నర్సీపట్నం

19న ప్రభుత్వ ఐటీఐలో మెగా జాబ్‌మేళా

పాయకరావుపేట, జూలై 16: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 19వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలు జేవై.సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టీసీఎస్(హైదరాబాద్), టెక్ మహేంద్ర(చెన్నై), క్యాసిన్ టెక్నాలజీస్(హైదరాబాద్), హబేల్ బెల్లోస్(దువ్వాడ), ఆర్‌హెచ్‌ఐ.మాగ్నెసిటా(పరవాడ), సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, గుడివాడ, ఎస్‌ఎస్.ముని స్పీడోమీటర్ మాన్యుఫ్యాక్చరింగ్(శ్రీసిటీ), హెటిరో ల్యాబ్స్(నక్కపల్లి), వరుణ్ మోటార్స్(విశాఖపట్నం), లక్ష్మి మోటార్స్(విశాఖపట్నం), కియా మోటార్స్(విశాఖపట్నం) తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోప, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడుల్లో పాసైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

AJC CLASSIFIEDS

WANTED

★ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ వైజాగ్ కొరకు అనుభవం కలిగిన ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. జీతం: 20,000/- సంప్ర: 9492173888 AJH-14305

FINANCE

రిటైర్డ్ పెన్షనర్స్ బుక్‌లుపైన, Govt. ఉద్యోగస్తులకు పేస్లిప్‌పైన సులభవాయిదా పద్ధతిలో ఫైనాన్స్ మరియు అన్ని తరగతుల వారికి డాక్యుమెంట్స్‌పైన తనఖా Pvt ఫైనాన్స్ 10లక్షలు లోపు ఇవ్వబడును. సిబిల్ చూచబడదు సెల్: 9666547338 AJD_186720

CHANGE OF NAME

★ I, MAQUANA NIRMAL S/o. Champalal Maquana, (Old Name), R/of D.No.30-11-7, Lakshmi Street, Daba gardens, Visakhapatnam District-530020, Andhra Pradesh, India. I have changed my name to MAQUANA NIRMAL RAJPUROHIT, (New Name) AJH-53793

CHANGE OF NAME

★ I, VARSHA MAQUANA D/o. Champalal Maquana, (Old Name), R/of D.No.30-11-7, Lakshmi Street, Daba gardens, Visakha patnam District-530020,Andhra Pradesh, India. I have changed my name to VARSHA RAJPUROHIT, (New Name) AJH-53795

PLOT FOR SALE

» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ. 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్. ఫామ్ హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర : 63028 55524. AJB_41

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

మన్యంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

» దేవదాయ శాఖ మంత్రిని కోరిన గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, జూలై 16: మన్యంలో దేవలాయల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని కోరినట్టు టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి తెలిపారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గ పరిధిలోని సమస్యలపై చర్చిస్తూ.. అల్లూరి జిల్లాలోని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు ఆలయాల్లో అర్చకులకు నెలకు రూ.10 వేలు వేతనం అందించాలని కోరినట్టు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఆమె చెప్పారు.

చెడు వ్యసనాలతో భవిష్యత్తుకు ముప్పు

» గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు

జి.మాడుగుల, జూలై 16: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు వసతి గృహంలో మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. వసతి గృహంలో అపరిచిత వ్యక్తులకు ప్రవేశం కల్పించొద్దని ఉపాధ్యాయులను ఆదేశించారు. అపరిచితులు వసతిగృహంలోకి ప్రవేశిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఏటీడబ్ల్యూవో తిరుపాల్, వార్డెన్ రవికుమార్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

» డీసీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రమేశ్

చింతపల్లి, జూలై 16: వినియోగదారుల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య (డీసీఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శి రమేశ్ చెప్పారు. వంగసార బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వినియోగదారుల హక్కులపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు కొనుగోలు చేసినా రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వెంటనే వస్తువుల తయారీ, గడువు తేదీలను పరిశీలించాలన్నారు. అలాగే వినియోగదారులు వస్తువుల నాణ్యతాప్రమాణాలు, కొలతలను పరిశీలించవచ్చునన్నారు. దుకాణాల్లో విక్రయించే వస్తువులపై అసంతృప్తి కలిగితే వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు పరిహారం పొందవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులకు వినియోగదారుల హక్కుల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీజీహెచ్ఎం పి.ప్రసాదరావు, సీనియర్ ఉపాధ్యాయులు త్రిమూర్తులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు చిరస్మరణీయం

చింతపల్లి, జూలై 16: స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీంద్రనాయక్ అన్నారు. కళాశాలలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జన్మించిన దేశ్‌ముఖ్ న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా దేశానికి ప్రత్యేక సేవలు అందించారని గుర్తు చేశారు. ఆమె రచనలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు లీలాపావని, రమణ, సంతోషి, కేజియా, ఈశ్వరరావు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

» వినియోగదారులు అగచాట్లు

అరకులోయ, జూలై 16: అరకులోయలో బీఎస్ఎన్ఎల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నెట్‌వర్క్ సిగ్నల్స్ అందక వినియోగదారులు ప్రతీ రోజు ఇబ్బందులు పడుతున్నారు. టెలికం అధికారులు సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇటీవల జియో, ఎయిర్‌టెల్ టవర్లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసినా, వాటి సేవలు కూడా అరకొరగానే అందుతున్నాయి సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో అధిక శాతం స్తంభాలు అలంకారప్రాయంగానే మారాయి. ఈ సమస్యపై ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కాక వినియోగదారులు అగచాట్లు పడుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో మన్యంలో సెల్ సేవలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మొండిగెడ్డలో తాత్కాలిక ఆధార్ కేంద్రం

గూడెంకొత్తవీధి, జూలై 16: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ కేంద్రంలో తాత్కాలిక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ బోయిన కుమారి చెప్పారు. మంగళవారం మొండిగెడ్డ పంచాయతీ కార్యాలయంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ శాశ్వత ఆధార్ నంబర్ లేనివారు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ఫలితంగా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్, ఎంపీడీవో ప్రత్యేక చొరవ తీసుకొని తాత్కాలిక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గిరిజనులు వీటిని ఉపయోగించుకోవాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

డుంబ్రిగుడ, జూలై 16: సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని కించుమండ సర్పంచ్ చెల్లమ్మ కోరారు. పంచాయతీ పరిధిలోని గౌలి, వసబంధ గ్రామాల్లో పర్యటించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాలతో వ్యాధులు పొంచి ఉన్నాయని, ఇళ్ల ఆవరణలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలు, మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

కాఫీ ఉత్పత్తి తయారీ రంగంపై అవగాహన పెంచుకోండి



కాఫీ ఉత్పత్తి, విల్వలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాడేరు రూరల్, జూలై 16: గిరిజన ప్రాంత విద్యార్థులు విద్యతో పాటు కాఫీ ఉత్పత్తి తయారీ రంగంపైనా అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి సూచించారు. టెక్నో సర్వ్ సంస్థ ఆధ్వర్యంలో కాఫీ ఉత్పత్తి తయారీపై మంగళవారం కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అరకు కాఫీకి దేశ విదేశాల్లో మంచి గుర్తింపు, గిరాకీ ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన కాఫీ ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. అందుకు విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. టెక్నో సర్వ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ సత్యమోహన్ మాట్లాడుతూ కాఫీ ఉత్పత్తి తయారీ రంగంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, ఎన్ఎస్ఎస్ పీవోలు జి.గౌరీశంకరరావు, సి.రమేష్‌బాబు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

ఏజెన్సీలో 11 రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు: కలెక్టర్ దినేశ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన డీఆర్‌వో పద్మావతి

పాడేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. అటవీ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి మంగళవారం నిర్వహించిన వర్చువల్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో అడవుల సంరక్షణను దృష్టిలో పెట్టుకుని అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రోడ్ల నిర్మాణాలకు సంబంధించి అటవీ భూముల అనుమతులపై అటవీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి రహదారులు నిర్మాణానికి సంబంధించి ఫారంలో 'ఏ'లో అటవీ శాఖ అనుమతులకు పంపించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు జాప్యం చేయకుండా ఫారం'బి'లో అనుమతులు జారీ చేయాలని సూచించారు. మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించే క్రమంలో తొలుతగా గ్రామసభ తీర్మానం చేయాలన్నారు. అలాగే గ్రామ సభ తీర్మానంలో భవిష్యత్‌లో పోడు వ్యవసాయం చేయబోమని గ్రామస్తుల ఆమోదం తీసుకోవాలన్నారు. అలాగే పాడేరు డివిజన్ పరిధిలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖకు చెందిన ఐదు రోడ్లు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖకు చెందిన ఆరు రోడ్లు నిర్మాణానికి జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించామన్నారు. అలాగే మారుమూల ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణాలకు అటవీ శాఖాధికారులు సానుకూలంగా ఉండాలన్నారు. అదే క్రమంలో అడవులను నిర్మూలిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. గత పదేళ్లలో రహదారుల నిర్మాణాల నిమిత్తం అనుమతించిన వివరాలపై ఆరా తీశారు. అవసరమైన మేరకు సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బి. పద్మావతి, వర్చువల్ విధానంలో స్థానిక డీఎఫ్‌వో వినోద్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం. రాజు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు టి.కొండయ్యపడాల్, శ్రీనివాసరావు, పాడేరు డివిజన్‌లోని తాహసీల్దార్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా వారపు సంత నిర్వహణ

» దుకాణాలు నాబార్డు నిధులతో నిర్మించిన షెడ్లకు తరలింపు

» డీఎల్‌పీవో పీఎస్ కుమార్ » 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



నాబార్డు నిధులతో నిర్మించిన షెడ్లు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి, జూలై 16: మండల కేంద్రంలోని వారపు సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) పీఎస్ కుమార్ తెలిపారు. ప్రతీ బుధవారం మండల కేంద్రంలో నిర్వహించే వారపు సంతలో ట్రాఫిక్ సమస్య వల్ల స్థానిక ప్రజలు, ఉద్యోగులు, వినియోగదారులు, వర్తకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ నెల 11వ తేదీన 'వారపు సంతలో ట్రాఫిక్ చిక్కులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ప్రత్యేక కథనానికి జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ స్పందించారు. చింతపల్లి వారపు సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవోను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం చింతపల్లి వచ్చిన డీఎల్‌పీవో వారపు సంత జరిగే ప్రాంతం, నాబార్డు నిధులతో నిర్మించిన షెడ్లను పరిశీలించారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో డీఎల్‌పీవో మాట్లాడుతూ వారపు సంత రోజు వర్తకులు రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడిందన్నారు. గతంలో సంతకు కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడం వల్ల వర్తకులు రహదారి ఇరువైపులా దుకాణాలు పెట్టుకుంటున్నారన్నారు. నాబార్డు, పంచాయతీ నిధులతో నిర్మించిన 40 దుకాణ షెడ్లు అందుబాటులో ఉన్నప్పటికీ వర్తకులకు పూర్తి స్థాయిలో సరిపడవని పంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకు రాలేదన్నారు. ఈ వారం నుంచి దుకాణాలన్నీ నాబార్డు షెడ్లు వద్ద ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి, ఈవోఆర్‌డీలను ఆదేశించామన్నారు. సంత షెడ్లలో కూరగాయల దుకాణాలు, ఖాళీగావున్న స్థలంలో ఇతర దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. బుధవారం నుంచి రహదారికి ఇరువైపులా ఎవరూ దుకాణాలు ఏర్పాటు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. అలాగే సంత సజావుగా నిర్వహించేందుకు పోలీసుల బందోబస్తు కూడా కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జీకే వీధిలో హోరున కురుస్తున్న వర్షం

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

గూడెంకొత్తవీధి, జూలై 16: మండలంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కుండ పోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువుల్లోకి వర్షపు నీరు చేరుకున్నది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ముంచంగిపుట్టును వీడని వాన



ముంచంగిపుట్టు సీహెచ్‌సీ మార్గంలో వరదనీని ప్రవాహం

ముంచంగిపుట్టు, జూలై 16: మండలాన్ని కొద్ది రోజులుగా వర్షం వీడటం లేదు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. సోమవారం రాత్రి సైతం భారీ ఈదురుగాలులతో కుండపోత వాన పడింది. స్థానిక సీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. అలాగే వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో కళకళలాడుతున్నాయి. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి.

మొదటి యూనిట్ వినియోగంలోకి తీసుకురండి

8 సీలేరు కాంప్లెక్సు జెన్‌కో సీఈ వాసుదేవరావు



పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై ఇంజనీర్లను వివరాలను అడుగుతున్న సీఈ

సీలేరు, జూలై 16: జల విద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్ త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సీలేరు కాంప్లెక్సు సీఈ వాసుదేవరావు ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. సీఈగా బాధ్యతలను చేపట్టిన ఆయన మొదటిసారిగా మంగళవారం సీలేరు వచ్చారు. ఈ సందర్భంగా సీలేరు జల విద్యుత్ కేంద్రంలో జరుగుతున్న మొదటి యూనిట్ మరమ్మతు పనులను, స్విచ్ యార్డు, ఎంసీఆర్‌ను పరిశీలించారు. మొదటి యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలు, జల విద్యుత్ కేంద్రంలో మిగతా మూడు యూనిట్ల పనితీరుపై, విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై ఈఈ రాజేంద్రప్రసాద్‌ను ఆరా తీశారు. మొదటి యూనిట్ శరవేగంగా చేయించి వినియోగంలోకి తీసుకొచ్చేలా పనులు వేగవంతం చేయించాలని ఆదేశించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, ఇరు రాష్ట్రాల వినియోగం తదితర వివరాలను సివిల్ ఈఈ ప్రభాకరరావును ఆరా తీశారు. రెగ్యులేటర్, గుంటవాడ, ఇంటెక్ డ్యాంల గేట్ల పనుతీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగతనాలపై జాగ్రత్తగా ఉండాలి: సీఐ రమేష్

పెదబయలు, జూలై 16: ఏవోబీ మండలాల్లో కొన్నాళ్లుగా జరుగుతున్న వరుస దొంగతనాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ సూచించారు. మోదసాయినగర్ కాలనీ వాసులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగలు చాకచక్యంగా ఇళ్లల్లో ఎవరూ లేని సమయం చూసి చొరబడుతూ దోపిడికి పాల్పడుతున్నారన్నారు. అందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నుంచి వేరే గ్రామాలకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గృహాల్లో విలువైన ఆభరణాలు ఉంచవద్దని, సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని ఆయన చెప్పారు. ఎవరైనా అనుమానంగా సంచరిస్తే 9440904227 (పెదబయలు ఎస్ఐ), 9440332756, 6281114358, 7981329513 (సిబ్బంది) నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

చింతలవీధి జంక్షన్‌లో రహదారికి మోక్షం

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన హైవే అధికారులు, కాంట్రాక్టర్లు



రోడ్డును మరమ్మతు చేస్తున్న హైవే అధికారులు

పాడేరు రూరల్, జూలై 16: మండలంలోని చింతలవీధి రహదారికి మోక్షం లభించింది. ఈ రోడ్డు జంక్షన్ వద్ద పెదబయలు, ముంచంగిపుట్టు వెళ్లే ప్రధాన రహదారి వర్షం కురిస్తే చెరువును తలపించడంతో వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన 'చెరువులా చింతలవీధి జంక్షన్' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాన్ని ప్రచురించడంతో హైవే అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించారు. ఈ మేరకు చింతలవీధి జంక్షన్‌కు చేరుకొని పెదబయలు, ముంచంగిపుట్టు ప్రధాన రహదారిలో వర్షానికి భారీగా నిలిచిన నీటిని తొలగించారు. రహదారిని మరమ్మతులు చేపట్టి ఇకపై నీటి నిలువ లేకుండా చర్యలు చేపడుతున్నామని గ్రామస్థులు, చింతలవీధి జంక్షన్ పరిసరాల్లో ఉన్న వ్యాపారులు, ప్రజలకు వివరించారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో హైవే కాంట్రాక్టర్లు స్పందించడంతో ఆ ప్రాంతీయులు పత్రికా యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జాజులబంద ఉపాధ్యాయుడిపై ఎంఈవో విచారణ

కొయ్యూరు, జూలై 16: జాజులబంధ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్న గ్రామస్థుల ఫిర్యాదుతో ఎంఈవోలు బోడంనాయుడు, రాంబాబు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో 29 ఆదివాసీ గిరిజనులు ఉండగా, పాఠశాల లేదని లేదని గత ఏడాది స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. దీనిపై ఎస్ఆర్‌సీ స్పందించి గ్రామంలో తక్షణమే పాఠశాల ఏర్పాటు చేయాలని గత జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అప్పటిలో కలెక్టరు పాఠశాల ఏర్పాటు చేసి ఒక ఉపాధ్యాయుడు ఉమామహేష్‌ను నియమించారు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి అతను సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, మధ్యాహ్న భోజన పథకం అమలు అందడం లేదని కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో ఎంఈవోలు విచారణ జరిపారు.

టొంగికోట పాఠశాల భవనం నేలమట్టం

... 5వ పేజీ తరువాయి

పడింది. దీంతో భవనం వెనుక భాగం నేలమట్టమైంది. ఇది రాత్రి వేళలో జరగడంతో పెనుప్రమాదం తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. లేకుంటే ప్రాణ నష్టం వాటిల్లేదని వారు పేర్కొన్నారు. పాఠశాల భవనం శిథిలవస్థకు చేరుకోవడంతో నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులకు పలు మార్లు వినతులు అందించినా ఫలితం కానరాలేదని వారు వాపోయారు. ఉన్న భవనం ఏ క్షణంలో నేలమట్టం అవుతుందోనన్న భయాందోళన నడుమ పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నామని వారు తెలిపారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో పాఠశాల వరండాలో సైతం పిల్లలు కూర్చోవడానికి ఇబ్బంది పడ్డారన్నారు. దీంతో ఉపాధ్యాయుడి సహకారంతో గ్రామస్థులు శ్రమదానంతో రేకుల షెడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే విద్యా శాఖ అధికారులు నేలమట్టమైన పాఠశాల భవనాన్ని పరిశీలించారు.

పాఠశాలకు ఎసరు!

... 5వ పేజీ తరువాయి

ఉన్నది. ఈ కారణంగా పాత పాఠశాల భవనం వినియోగించే పరిస్థితిలేదని ఉపాధ్యాయులు గ్రామంలోని ఓ గిరిజనుడు ఇంటి వరండాలో విద్యాబోధన సాగిస్తున్నారు.

వర్షం కురిస్తే విద్యాబోధనకు అంతరాయం

వర్షం కురిస్తే విద్యాబోధనకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. వర్షం కురిస్తే ఇంటి వరండాలో విద్యార్థులపై పడుతుంది. దీంతో విద్యార్థులు తడిసిపోతున్నారు. ఈ కారణంగా ఉపాధ్యాయులు బోధన చేయలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

జాతీయ రహదారి విస్తరణకు ముందు గ్రామంలో స్థలం చూపిస్తే నూతన పాఠశాల భవనం నిర్మిస్తామని విద్యా కమిటీ, ఉపాధ్యాయులకు ఎన్‌హెచ్ అధికారులు హామీ ఇచ్చారు. విద్యార్థులు పాఠశాల భవనాన్ని ఖాళీ చేసి సుమారు ఏడు నెలలు కావస్తున్నప్పటికీ నూతన భవనం నిర్మాణంపై ఎన్‌హెచ్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదు. విద్యా కమిటీ సభ్యులు నూతన భవనం నిర్మాంచాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఏ ఒక అధికారి సరైన సమాధానం చెప్పడం లేదని విద్యాకమిటీ సభ్యులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీ టికెట్‌కు వైసీపీలో లొల్లి

... 5వ పేజీ తరువాయి

కేటాయిస్తారని పార్టీ నేతలంతా అభిప్రాయం వ్యక్తంచేసేవారు. అయితే ఇటీవల సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్టీ కోసం తీవ్రంగా కష్టపడడంతోపాటు ఎన్నికల్లో భారీగా డబ్బులు ఖర్చు చేసినందున తనకు ఎమ్మెల్సీ ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మరో ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పార్టీపై పోరాటం చేయాలంటే తనకు ఏదో ఒక చట్టబద్ధమైన పదవి అవసరమని అమర్‌నాథ్ అడిగినట్టు పేర్కొంటున్నారు. మరోవైపు గడిచిన ఎన్నికల్లో దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టడంతో కూటమి ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని, వాటన్నింటినీ తట్టుకుని నిలబడాలంటే చట్టబద్ధమైన పదవి ఉంటేనే తప్ప సాధ్యం కాదని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధిష్ఠానానికి మొరపెట్టుకున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. తనకు ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినప్పటికీ ఏదో రకంగా కేసుల్లో ఇరికించే అవకాశం ఉన్నందున ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఆయన కోరుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే కోలా గురువులు మాత్రం తనకు అధిష్ఠానం అన్యాయం చేయదని ధీమాగా ఉన్నారు. ఇటీవల నగరానికి వచ్చిన పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద ముగ్గురు నేతలు ఈ విషయం కదిపారు. ఎవరికి వారు తమకే ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఆయన తల పట్టుకున్నట్టు సమాచారం. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుటామని వారికి సుబ్బారెడ్డి చెప్పినట్టు తెలిసింది.

గంజాయిని అరికట్టి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడండి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూలై 16: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయిని అరికట్టి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాడేరు ఐటీడీఏలో పాలక మండలి సమావేశాలు నిర్వహించకపోవడంతో రెండేళ్లుగా విద్యా శాఖా పనితీరు అస్తవ్యస్తంగా మారడంతో విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్నారని ఆరోపించారు. అందుకు జి.మాడుగుల మండలంలోని జూనియర్ కళాశాలలో జరిగిన ఘటనే నిదర్శనమన్నారు. ఐటీడీఏ విద్యా శాఖాధికారులు ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో అక్రమ డిప్యుటేషన్‌లతో నియామకాలు చేపట్టిన వసతి నిర్వాహకుల ఉత్తర్వులను రద్దు చేసి, అర్హత ఉన్న బాధ్యతగల వారిని నియమించాలని ఆమె సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చింతపల్లి, జూలై 16: సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బియ్యం సరఫరాను వీఆర్వోలు పరిశీలించాలని, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సరకులు అందేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీటీ రాజ్‌కుమార్, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీలేరు వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

సీలేరు, జూలై 16: వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులపై కేకలు వేసిన సీలేరు వైద్యాధికారిపై చర్యలు గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి 11 గంటలకు వైద్యం నిమిత్తం సీలేరు ఆసుపత్రికి చిన్నారులను తీసుకువెళలగా విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు డాక్టర్ సౌమ్యకు తెలిపారన్నారు. ఫోన్ బాధితులకు ఇవ్వాలని చెప్పిన డాక్టర్ సౌమ్య, పిల్లలకు ఏం జరిగిందని ఆరా తీయకుండా అర్ధ రాత్రి వస్తే ఎలా కేకలు వేయడం సరికాదన్నారు. ఈ సంఘటనపై కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మాజీ వలంటీర్ వీరంగం

మద్యం మత్తులో వైద్య శిబిరానికి వచ్చి బీభత్సం

వైద్య పరికరాలు, మందుల చెల్లాచెదురు

పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు

మాకవరపాలెం, జూలై 16: అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరులో ఓ మాజీ వలంటీర్ మంగళవారం బీభత్సం సృష్టించాడు. 108 సిబ్బందితో కలిసి సచివాలయ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహిస్తుండగా మద్యం మత్తులో అక్కడకు నానా అల్లరి చేశాడు. టేబుళ్లను తిరగేసి మందులను చెల్లాచెదురు చేశాడు. దీనిపై పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా వున్నాయి. గిడుతూరులోని రామాలయం వద్ద ఉన్న భవనంలో 108 సిబ్బంది ప్రతి మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. సచివాలయ సిబ్బంది అక్కడ సేవలు అందిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ సమయంలో మూకల రమణబాబు అనే మాజీ వలంటీర్ అక్కడకు వచ్చాడు. అతను ఎన్నికల ముందు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కాగా మద్యం మత్తులో వైద్య శిబిరానికి రావడంతో అక్కడ ఉన్నవారంతా ముక్కు మూసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన మాజీ వలంటీర్ అక్కడ ఉన్న కుర్చీలు, టేబుళ్లను విసిరికొట్టాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఆశ కార్యకర్త పాసపు రామరత్నానికి గాయపడ్డారు. అంతటితో ఆగకుండా అతను రోగులకు ఇవ్వాల్సిన మందులను చెల్లాచెదురు చేశాడు. వైద్య పరికరాలను పగులగొట్టాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఏఎన్ఎం సాయిరెడ్డి నాగలక్ష్మి, ఆశ కార్యకర్త పాసపు రామరత్నం ఫిర్యాదు చేశారు. మాజీ వలంటీర్ రమణబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పెందుర్తిలో 359 కిలోల గంజాయి స్వాధీనం

» 12 మంది అరెస్టు

పెందుర్తి, జూలై 16: పెందుర్తి పోలీసులు మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 359 కిలోల గంజాయి పట్టుకున్నారు. ఈ సందర్భంగా 12 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఒక యువతి కూడా ఉంది. నిందితుల వద్ద నుంచి కారు, బైకులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు.

కారులో 284 కిలోల గంజాయి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు సరిపల్లి వద్ద ఏర్పాటుచేసిన డైనమిక్ చెక్‌పోస్ట్ వద్ద సీఐ ఎల్.రామకృష్ణ మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అత్యంత వేగంగా వచ్చిన ఒక కారు చెకపోస్టు వద్ద ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆ కారును తనిఖీ చేయగా 284 కిలోల గంజాయి లభించింది. ఏజెన్సీ ప్రాంతం నుంచి కారులో నగరానికి గంజాయి రవాణా చేస్తునట్టు పోలీసులు విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజిత్‌సింగ్ (27), విశాఖ కంచరపాలేనికి చెందిన గమ్మెలి తిరుపతి (22), ఒడిశాకు చెందిన రాజేశ్‌పట్నాయిక్ (34), కోరాపుట్‌కు చెందిన బజింగ రఘు (30), ఒడిశాకు చెందిన పాటికర్ (32), కోరాపుట్‌కు చెందిన పాంగీ (19), మాచ్‌ఖండ్‌కు చెందిన శశీంద్ర (31)లను అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజిత్‌సింగ్ కుటుంబంతో పెందుర్తిలో నివాసం ఉంటున్నారు. పోర్టులో బొగ్గు కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్‌కు ఎగుమతి చేసేవాడు. అతనికి అరకులోయకు చెందిన హరి పరిచయం అయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించవచ్చునసే ఉద్దేశంతో అతని ద్వారా గంజాయిని తెప్పించుకుని యూపీకి పంపడం మొదలెట్టాడు. అలాగే రాజేశ్ పట్నాయక్ ఒడిశా నుంచి వలస వచ్చి విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఇల్లు అద్దెకు తీసుకుని గంజాయి నిల్వ చేస్తుంటాడు. పాటికర్, పాంగీ, శశీంద్ర, రఘు గంజాయి రవాణాకు స్లీపర్ సెల్స్‌గా పనిచేస్తున్నారని ఏసీపీ తెలిపారు.

పెందుర్తిలో ఓ ఇంటిలో 75 కిలోల గంజాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా జీకె వీధి మండలం ఆర్కేనగర్‌కు గొల్లూరి నాగు (22), అదే జిల్లాకు చెంది విశాఖలో ఫిజియోథెరపీ కోర్సు చదువుతున్న యువతి (19) పెందుర్తి పులగాలిపాలెం శివారు ప్రాంతంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. అదే జిల్లాకు చెందిన గుంట ప్రసాద్, గురుమూర్తిలు ఏజెన్సీ, ఒడిశా ప్రాంతం నుంచి తెప్పించిన గంజాయిని వారి ఇంట్లో నిల్వ చేస్తుంటారు. ఇలా నిల్వ చేసిన గంజాయిని ప్యాకింగ్ చేసి ఢిల్లీకి చెందిన సెంధిల్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్ఐ సింహాచలం ఆ ఇంటిపై దాడులు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఐదుగురినీ అరెస్టు చేశారు.